క్లుప్తంగా

అనాథ పిల్లలను గుర్తించాలి

ముధోల్: తల్లిదండ్రులు లేని అనాథ పిల్లలను గుర్తించి వారి వివరాలు సేకరించాలని బాలల సంరక్షణ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలోని ఐసీడీఎస్ కార్యాలయంలో అనాథ పిల్లల 166 దరఖాస్తులను గురువారం పరిశీలించారు. వచ్చిన దరఖాస్తులపై విచారణ పూర్తయిన తర్వాత అనాథలకు నెలకు రూ.నాలుగు వేల ఆర్థికసాయం అందిస్తామని పేర్కొన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని బాసర, ముధోల్, తానూర్, లోకేశ్వరం, మండలాల్లోని అనాథలను గుర్తించి దరఖాస్తులు తీసుకోవాలని సీడీపీవో శ్రీమతికి సూచించారు. సూపర్‌వైజర్ గంగభూషణ్, సామాజిక కార్యకర్త మమత పాల్గొన్నారు.

నిల్వనీటితోనే రోగాలు

లోకేశ్వరం: నిల్వనీటితోనే దోమలు వ్యాప్తి చెంది రోగాల బారిన పడతామని ఎంపీడీవో సోలమాన్ రాజ్ అన్నారు. గురువారం మండలంలోని రాయపూర్‌కాండ్లీలో రోడ్లు, మురికి కాలువలు, హరితహారం మొక్కలను పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఎంపీడీవో స్థానికులకు సూచించారు. కార్యదర్శి నారాయణ తదితరులున్నారు.

జిల్లా ఆస్పత్రిలో సదరం శిబిరం



శిబిరానికి హాజరైన బాధితులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా ప్రధాన ఆస్పత్రిలో గురువారం కంటికి సంబంధించి సదరం శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ కంటి వైద్య నిపుణుడు బి.సురేశ్ ఆధ్వర్యంలో దరఖాస్తుదారులకు కంటి పరీక్షలు నిర్వహించారు. శిబిరానికి 60 మంది దరఖాస్తు చేసుకున్నారని ఇందులో కొత్తవారు 30 మంది, రెన్యువల్ కోసం 27 మంది హాజరైనట్లు తెలిపారు. శిబిరంలో డాక్టర్ రజిత, నిర్వాహకులు జాప ప్రదీప్ పాల్గొన్నారు.

అక్రమ విద్యుత్ కనెక్షన్లు తొలగించాలి

ముధోల్: మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో ఉన్న అక్రమ విద్యుత్ కనెక్షన్లను వెంటనే తొలగించాలని భైంసా విద్యుత్ ఏడీ లక్ష్మణ్‌గౌడ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్ కార్యాలయ ఆవరణలో సిబ్బందితో మాట్లాడారు. గణేశుడి మండపాల వద్ద అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన కనెక్షన్లను తొలగించాలన్నారు. సకాలంలో బిల్లులు వసూలు చేయాలని సూచించారు. ఏఈ శ్రీకాంత్, లైన్‌మెన్లు సాయినాథ్, అల్దార్, సిబ్బంది పాల్గొన్నారు.

స్టాంప్ విడుదల హర్షణీయం

ఖానాపూర్: గిరిజనుల ఆరాధ్యదైవం రాంజీగోండు పేరిట కేంద్రప్రభుత్వం పోస్టల్ స్టాంప్‌ను విడుదల చేయడం హర్షణీయమని లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు బానావత్ గోవింద్ అన్నారు. గురువారం పట్టణంలోని ఆర్అండ్‌బీ విశ్రాంతి భవనంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాంజీగోండు పోరాట స్ఫూర్తిని ప్రపంచానికి తెలిపిన బెల్లయ్యనాయక్‌కు ఈ ఘనత దక్కుతుందన్నారు. బత్తుల రంజిత్, రాసమల్ల అశోక్, సోఫియాన్, వెంకటస్వామి, రోహిదాస్, అజీం, సత్యం, తదితరులు ఉన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి



మాట్లాడుతున్న ఆర్డీవో రత్నకల్యాణి

కడెం: ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు నిర్మించుకున్న యజమానులు జీవో నం.59 కింద దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో రత్నకల్యాణి పిలుపునిచ్చారు. గురువారం కడెం తహసీల్దార్ కార్యాలయంలో జీవోపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. మీ సే వా కేంద్రాల్లో ప్రభుత్వం నిర్దేశించిన రుసుం చెల్లిస్తే మూడు రోజుల్లో ఇళ్ల పట్టాలను అందిస్తామని వారు పేర్కొన్నారు. తహసీల్దార్ రాజేశ్వరి, డీటీ చిన్నయ్య తదితరులు ఉన్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

ఖానాపూర్: పట్టణంలోని బర్కత్‌పుర అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషణ మాసోత్సవం నిర్వహించారు. చిరుధాన్యాలతో కలిగే ప్రయోజనాలను సిబ్బంది వివరించారు. సిబ్బంది వరలక్ష్మి, సుప్రియ, గంగామణి, సులేమాన్, పుష్పలత తదితరులు ఉన్నారు.

ముధోల్: మండల కేంద్రంలోని ఏడు అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం సీడీపీవో శ్రీమతి లబ్ధిదారులకు పౌష్టికాహారం పంపిణీ చేశారు. అంగన్‌వాడీ సిబ్బంది సమ్మెలో ఉండటంతో సూపర్‌వైజర్ల సాయంతో పోషకాహారం పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు.

మండలంలో భారీ వర్షం

లక్ష్మణచాంద/కుంటాల: మండలంలోని గ్రామాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. కొద్దిరోజులుగా వర్షం లేకపోవడంతో ప్రజలు ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు. వర్షం కారణంగా సాగు పనులు చేపట్టలేదు. కుంటాల మండలంలో 29 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఏఎస్‌వో సాయన్న తెలిపారు.

గుంతలరోడ్డుపై నరక ప్రయాణం

- అధ్వానంగా అందాకూర్–వెంకూర్ రోడ్డు
- గతేడాది రూ.ఐదు కోట్లు మంజూరు
- అయినప్పటికీ పనులు చేపట్టని అధికారులు
- రాకపోకలకు ఇబ్బంది పడుతున్న ప్రజలు



దెబ్బతిన్న పెంచికల్‌పాడ్–విఠాపూర్ రోడ్డు



అందాకూర్–పెంచికల్‌పాడ్ గ్రామాల మధ్య కోతకు గురైన రోడ్డు

కుంటాల: దేవుడు వరమిచ్చినా పూజారి కరుణించని విధంగా మారింది మండలంలోని అందాకూర్–వెంకూర్ రోడ్డు దుస్థితి. కుంటాల మండలంలోని అందాకూర్ నుంచి పెంచికల్‌పాడ్, విఠాపూర్ గ్రామాల మీదుగా కొత్త వెంకూర్ వరకు తొమ్మిదిన్నర కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించేందుకు ప్రభుత్వం ఏడాది కిందట రూ.ఐదు కోట్లు మంజూరు చేసింది. కానీ అధికారులు ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. దీంతో ఈ మార్గంలో రాకపోకలు సాగించేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు వాహనదారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పనులు ప్రారంభించాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

ప్రయాణం నరకయాతన

గతంలో మండలంలో అందాకూర్– వెంకూర్ వరకు నిర్మించిన రోడ్డు భారీ వర్షాలకు గుంతలమయంగా మారింది. విఠాపూర్, పెంచికల్‌పాడ్ గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే.. భైంసా మండలంలోని తిమ్మాపూర్, కల్లూర్ ముందుగా తిరిగి వచ్చేవారు. కానీ 2014లో వెంకూర్ నుంచి కుంటాలకు రోడ్డు ఏర్పాటు చేయడంతో దూరభారం తగ్గింది. విఠాపూర్, పెంచికల్‌పాడ్ గ్రామాల ప్రజలు నిర్మల్, భైంసా పట్టణాలకు వెళ్లాలంటే అందాకూర్ మీదుగా.. కుంటాల వెళ్లేందుకు పాత, కొత్తవెంకూర్ గ్రామాల మీదుగా ప్రయాణిస్తున్నారు. కానీ ఈ రోడ్డు తారు లేచి ఉండటంతో ప్రయాణికులు నరకయాతన పడుతున్నారు.

కొత్తరోడ్డు నిర్మాణానికి నిధులు..

వర్షాలకు అందాకూర్–పెంచికల్‌పాడ్, కొత్తవెంకూర్–పాతవెంకూర్ గ్రామాల మధ్య రోడ్డు కోతకు గురైంది. వీడీసీ సభ్యులు మొరం వేయించి తాత్కాలికంగా మరమ్మతులు చేయించారు. ప్రజల వినతి మేరకు ఈ మార్గంలో రోడ్డు నిర్మించేందుకు రూ.ఐదు కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది.

గుంతలమయంగా రోడ్డు



మా గ్రామం నుంచి కుంటాల వెళ్లాలంటే భైంసా మండలంలోని తిమ్మాపూర్ మీదుగా వెళ్లేవాళ్లం. వెంకూర్ మీదుగా రోడ్డు వేయడంతో దూరభారం తగ్గింది. కానీ ప్రస్తుతం ఈ రోడ్డంతా గుంతలమయంగా మారడంతో ఇబ్బందులు తప్పడం లేదు. అధికారులు సమస్య పరిష్కరించాలి.

– మహబూబ్‌ఖాన్, పెంచికల్‌పాడ్

గతేడాది నిధులు మంజూరు



ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు దెబ్బతింది. తారు లేచిపోవడంతో ప్రయాణం కష్టంగా మారింది. ఏడాది కిందట ప్రభుత్వం నిధులు మంజూరు చేసినా అధికారులు ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. ప్రజలు ఇబ్బంది పడకుండా వెంటనే రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించాలి.

– చిన్నారెడ్డి, విఠాపూర్

త్వరలో పనులు ప్రారంభిస్తాం

అందాకూర్–వెంకూర్ రోడ్డు నిర్మాణం రూ.ఐదు కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇటీవల టెండర్ల ప్రక్రియ నిర్వహించాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు త్వరలో పనులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటాం.

– రఘువంశీ, పీఆర్ జేఈ

హామీలు నెరవేర్చడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం

- బీజేపీ నాయకుడు మహేశ్వర్‌రెడ్డి



మామడ: బురదపల్లిలో పర్యటిస్తున్న మహేశ్వర్‌రెడ్డి

మామడ: బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలమైందని, రానున్న ఎన్నికలలో బీఆర్ఎస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారని బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని వస్తాపూర్, బురదపల్లి, బూరుగుపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, దళితులకు మూడు ఎకరాల భూమి, పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని హామీ ఇచ్చిన సీఎం కేసీఆర్ అమలు చేయడంలో విఫలం అయ్యారని విమర్శించారు. బీజేపీ అధికారంలోకి రాగానే పేద ప్రజల సంక్షేమం కోసం కృషి చేస్తామన్నారు. బూరుగుపల్లి శివాలయం, వస్తాపూర్‌లో హన్మాన్ ఆలయంలో పూజలు చేశారు. వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో మెడిసెమ్మె రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, అయ్యన్నగారి రాజేందర్, బాపురెడ్డి, కోండ్రరాజారెడ్డి, లింగారెడ్డి, విలాస్, ముత్యంరెడ్డి, హరీశ్‌రెడ్డి, హమ్లానాయక్, రమణారెడ్డి పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన ఏఎంసీ మాజీ డైరెక్టర్

సారంగాపూర్: మండలంలోని జామ్ గ్రామానికి చెందిన మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ బాలకిష్టు రాజేందర్ మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీలో చేరాడు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు వి లాస్, రాంశంకర్‌రెడ్డి, సాహెబ్‌రావు, రాజేశ్వర్, తిరుమలాచారి, మధు, తదితరులు పాల్గొన్నారు.

పాపహరేశ్వరాలయంలో పూజలు

దిలావర్‌పూర్: మండలంలోని శ్రీమాతాన్నపూర్ణ పాపహరేశ్వరాలయంలో గురువారం బీజేపీ నాయకులు మహేశ్వర్‌రెడ్డి పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ స్వామివారి దర్శనం అనంతరం తన ఎన్నికల ప్రచారం చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. ఇందులో జెడ్పీటీసీ సభ్యుడు రమణారెడ్డి, సర్పంచ్‌ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు జంగం వీరేశ్‌కుమార్, డి.ముత్యంరెడ్డి, మండలాధ్యక్షుడు పీసరి శైలేశ్వర్, సుధాకర్‌రెడ్డి, నర్సయ్య, ప్రసాద్ పాటిల్, మల్లేశ్, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటరు నమోదు వేగవంతం చేయాలి

- కలెక్టర్ వరుణ్‌రెడ్డి



రికార్డులు పరిశీలిస్తున్న కలెక్టర్ వరుణ్‌రెడ్డి

లక్ష్మణచాంద: మండలంలో ఓటరు నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలని కలెక్టర్ వరుణ్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం తనిఖీ చేసి ఓటరు నమోదు ప్రక్రియ పరిశీలించారు. 18 ఏళ్లు నిండినవారంతా ఓటరుగా నమోదు చేసుకునేలా చూడాలన్నారు. రైతుల రుణమాఫీ జరిగిందా లేదా తెలుసుకోవాలని ఏవో ప్రవీణ్‌కుమార్‌ను ఆదేశించారు. మండల కేంద్రంలో విద్యుత్ సరఫరాలో తరచూ అంతరాయం ఏర్పడుతుండటంతో తమ పనులకు ఆటంకం కల్గుతుందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఆయన వెంటనే విద్యుత్ ఉన్నతాధికారులకు చెప్పి సమస్య పరిష్కరిస్తానని తెలిపారు. తహసీల్దార్ కె.శ్రీలత, ఎంపీడీవో శేఖర్, డిప్యూటీ తహసీల్దార్ గంగాధర్, ఏవో ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కంటి వైద్య శిబిరం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లా కేంద్రంలోని పెన్షనర్ల సంఘం భవనంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం గ్లోబల్ సూపర్ స్పెషాలిటీ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఏర్పాటు చేయనున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంసీ లింగన్న ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు నిర్వహించే శిబిరాన్ని పెన్షనర్లు, వారి కుటుంబసభ్యులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి ఆపరేషన్లు ఉచితంగా చేయబడుతాయని పేర్కొన్నారు.

నేడు నిర్వాహకులతో సమావేశం

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని ఆర్.కె కన్వెన్షన్‌హాల్‌లో ఈనెల 22న శుక్రవారం గణేశుడి మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించనున్నట్లు గణేశ్ ఉత్సవ సమితి అధ్యక్షుడు ముప్పిడి రవి ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, పోలీస్, విద్యుత్, వైద్య అధికారులు హాజరవుతారని పేర్కొన్నారు.

‘ఆశ’ల సమస్యలు పరిష్కరించాలి



లోకేశ్వరంలో వినతిపత్రం ఇస్తున్న ఆశవర్కర్లు

భైంసాటౌన్: తమ సమస్యలు పరిష్కరించాలని ఆశ కార్యకర్తలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం భైంసాలో తహసీల్దార్ ప్రవీణ్‌కు వినతిపత్రం అందజేశారు. చాలిచాలనీ వేతనంతో ఇబ్బందులు పడుతున్నామని.. నెలకు వేతనం రూ.18వేలు ఇవ్వాలని కోరారు. విజయలక్ష్మి, వందన, శాంత, పద్మ, మంజుల పాల్గొన్నారు.

లోకేశ్వరం: ఆశవర్కర్లకు పీఎఫ్, ఈపీఎఫ్, ఉద్యోగ భద్రత వంటి సౌకర్యాలను కల్పించాలని ఆశవర్కర్ల సంఘం మండలాధ్యక్షురాలు ఆనంద డిమాండ్ చేశారు. గురువారం తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ మోతీరాంకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గోదావరి, కల్యాణి, స్వప్న, సాయన్న, అనురాధ, సవిత, శారద, సబిత, గంగామణి, మమత పాల్గొన్నారు.

ఐలమ్మ విగ్రహావిష్కరణ

భైంసారూరల్: మండలంలోని ఖథ్‌గాం గ్రామంలో గురువారం పోరాట యోధురాలు చాకలి ఐలమ్మ విగ్రహాన్ని సర్పంచ్ రాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో రజక సంఘం రాష్ట్ర కన్వీనర్ సుంకెట పోశెట్టి, ఎంపీటీసీ మాణిక్‌రావు, మాజీ సర్పంచ్ రాము, లక్ష్మణ్, రాములు, పలువురు రజక సంఘం సభ్యులు పాల్గొన్నారు.

11వ రోజుకు అంగన్‌వాడీల సమ్మె



సర్సాపూర్(జి)లో వంటావార్పు నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు

సారంగాపూర్: స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సమ్మె శిబిరం వద్ద అంగన్‌వాడీ సిబ్బంది భిక్షాటన కార్యక్రమం నిర్వహించారు. సమ్మె శిబిరాన్ని డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అరాచక పాలన కొనసాగుతుందన్నారు. ప్రభుత్వం అంగన్‌వాడీల డిమాండ్లు నెరవేర్చకపోతే కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వీరయ్య, బొల్లోజి నర్సయ్య, సలీమ్, నాందేడపు చిన్ను, తదితరులు ఉన్నారు.

మండల కేంద్రంలో వంటావార్పు

సర్సాపూర్(జి): తమ సమస్యలు పరిష్కరించాలని తహసీల్దార్ కార్యాలయం వద్ద అంగన్‌వాడీ సిబ్బంది చేపట్టిన సమ్మె 11వ రోజుకు చేరింది. గురువారం శిబిరం వద్ద వంటావార్పు కార్యక్రమం నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సామూహిక భోజనాలు చేశారు.

కుంటాల: కుంటాలలో అంగన్‌వాడీ సిబ్బంది నోటికి చేతులు అడ్డుగా పెట్టుకొని మాట్లాడకుండా వినూత్నంగా నిరసన తెలిపారు.

లంబోదరుడికి ప్రత్యేక పూజలు



ఖానాపూర్: మస్కాపూర్‌లో భక్తుల పూజలు



తానూరు: ఏఎస్పీని సన్మానిస్తున్న సభ్యులు

లక్ష్మణచాంద: మండలంలోని అన్ని గ్రామాల్లో గణనాథుడు ప్రత్యేక పూజలు అందుకుంటున్నాడు. ఈమేరకు గురువారం వినాయకుడికి భక్తులు నైవేద్యం సమర్పించి.. అన్నదానం చేశారు.

ముధోల్: మండల కేంద్రంలోని బస్టాండ్ మంజూనాథ గణేశుడి వద్ద , కిశోర్ యూత్ గణేశుడి వద్ద, మహాలక్ష్మీ వీధిలోని అఖండ గణనాథుని మండపం వద్ద అన్నదానం చేశారు. దాతలు గంగారెడ్డి, అంజిగౌడ్, రమేశ్, వెంకటేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ఖానాపూర్: మండలంలోని మస్కాపూర్ గ్రామంలో భాగ్యనగర్ గణేశుడి మండపం వద్ద గురువారం భక్తులకు అన్నదానం చేశారు. అంతకుముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కర్ర వినాయకుడిని దర్శించుకున్న ఏఎస్పీ

తానూరు: మండలంలోని భోసి గ్రామంలో నెలకొల్పిన కర్ర వినాయకుడిని భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ గురువారం దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సన్మానించి తీర్థప్రసాదాలు అందించారు. గ్రామంలో ఒకే గణపతిని ప్రతిష్ఠించి ఉత్సవాలు వైభవంగా జరుకోవడం బాగుందన్నారు. గ్రామాన్ని ఆదర్శగా తీసుకుని పాటించాలన్నారు. ఆయన వెంట సీఐ వినోద్, ఎస్సై సందీప్, ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు మురళి, అధ్యక్షుడు నాగనాథ్, సర్పంచ్ ఆనంద్ ఉన్నారు.

ఉద్యాన పంటల సాగుతో లాభాలు



మాట్లాడుతున్న ఎంపీపీ మహిపాల్‌రెడ్డి

సారంగాపూర్: రైతులు ఉద్యాన పంటలు సాగు చేసి అధిక లాభాలు పొందాలని ఎంపీపీ అట్ల మహిపాల్‌రెడ్డి అన్నారు. గురువారం మండల పరిషత్ సమావేశ మందిరంలో అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంలో భాగంగా వందశాతం రాయితీపై గుంతలు తవ్వించడంతోపాటు డ్రిప్ పరికరాలు, పండ్ల మొక్కలను అందిస్తారని పేర్కొన్నారు. ఈపథకం కింద రైతులు మామిడి, నిమ్మ, జామ, బత్తాయి, కొబ్బరి, డ్రాగన్‌ఫ్రూట్, సీతాఫలం వంటి పండ్ల తోటలు సాగు చేయవచ్చని తెలిపారు. నిర్వహణ ఖర్చులను సైతం ప్రభుత్వం అందిస్తుందని.. ఆసక్తి కల్గిన రైతులు తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. గ్రామాల్లో ఉద్యానవన పంటల సాగు, పారిశుధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సరోజ, ఎంపీఓ తిరుపతిరెడ్డి, ఏఓ రాజశేఖర్‌రెడ్డి, ఏపీఓ లక్ష్మారెడ్డి, సిబ్బంది, కార్యదర్శులు, అధికారులు పాల్గొన్నారు.

‘బీజేపీ బలోపేతానికి కృషి చేయండి’



దస్తురాబాద్: నూతన కార్యాలయంలో మాట్లాడుతున్న మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్

దస్తురాబాద్: వచ్చే ఎన్నికల్లో గెలిచేలా బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నాయకుడు, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్ పేర్కొన్నారు. గురువారం మండల కేంద్రంలో బీజేపీ కార్యాలయం ప్రారంభించి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటికీ వివరించాలన్నారు. అంతకుమందు బీజేపీ జెండాను మండలాధ్యక్షుడు లక్ష్మణ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు చుంచు వెంకన్న, రాజేశం, రాజు, రాయమల్లు, గంగాధర్, సాగర్, రాము, తిరుపతి, సత్తన్న, లక్ష్మీనర్సయ్య, స్వామి తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని అయ్యప్ప ఆలయంలో మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే సుమన్‌బాయి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు అభిషేకం, హోమం తదితర పూజా కార్యక్రమాలు చేశారు. అర్చకులు నితీశ్, విజయ్, నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళి



ఖానాపూర్‌లో నివాళులర్పిస్తున్న నాయకులు

ఖానాపూర్: పట్టణంలోని తిమ్మాపూర్ పద్మశాలి సంఘ భవనంలో గురువారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

కుంటాల: మండలంలోని కల్లూర్, పెంచికల్‌పాడ్, కుంటాల, ఓలా గ్రామాల్లో గురువారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతి నిర్వహించారు. వారి చిత్రపటానికి పూలమాలలు నివాళులర్పించారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం మండల కన్వీనర్ గుద్దేటి గంగాధర్, పల్లికొండ గజేందర్, గంగయ్య, చిన్నా, భోగ గోవర్ధన్, చంద్రకాంత్, కిష్టయ్య, గాయత్రి, చందు, భోగ నారాయణ, సాయిరాం, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

బాబా ఆలయంలో పూజలు

కుంటాల: మండలంలోని కల్లూర్ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. గోపూజ, బాబాకు అభిషేకం, మంగళస్నానం కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

సంక్షిప్త వార్తలు

సర్పంచ్, కార్యదర్శికి సత్కారం

కడెం: మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ పంచాయతీ ఇటీవల రాష్ట్ర స్థాయిలో స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుకు ఎంపికైన విషయం తెలిసిందే. గురువారం పంచాయతీ పరిధిలోని పెత్తర్పు పాఠశాలలో సర్పంచ్ బొడ్డు గంగన్న, ఉపసర్పంచ్ ఆనంద్, కార్యదర్శి రమాదేవిలను ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు భీమలింగం, ప్రతాప్, చిన్నయ్య, రాజేశ్, లింగన్న తదితరులు ఉన్నారు.

డీసీసీ అధ్యక్షుడి పరామర్శ

సారంగపూర్: మండలంలోని చించోలి(బి) గ్రామానికి చెందిన రాంశంకర్‌రెడి తల్లి చిన్నరామవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం బాధిత కుటుంబాన్ని డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు పరామర్శించారు. వారి వెంట కాంగ్రెస్ మండల నాయకులు, తదితరులు ఉన్నారు.

జాన్సన్‌నాయక్ పరామర్శ

కడెం: మండలంలోని మాసాయిపేట్‌లో మాజీ ఎంపీపీ రాజేశ్వర్‌గౌడ్, సర్పంచ్ రాముగౌడ్ తండ్రి కొమురయ్య గురువారం మరణించారు. బీఆర్ఎస్ అభ్యర్థి భుక్యా జాన్సన్ నాయక్, లోక భూమారెడ్డిలు బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి సంతాపం వ్యక్తం చేశారు. జాన్సన్‌నాయక్ పాడె మోసి అంత్యక్రియల్లో పాల్గొన్నాడు. ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ రాజేందర్, చంద్రశేఖర్, జీవన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ఖానాపూర్: మండలంలోని కొత్తపేటలో నారాయణ రెడ్డి కోడలు మృతి చెందగా బాధిత కుటుంబసభ్యులను బీఆర్ఎస్ నాయకుడు జాన్సన్‌నాయక్ పరామర్శించారు. మృతికి కారణాలను తెలుసుకున్నారు. పెంబి మండలానికి చెందిన పలువురు జాన్సన్‌నాయక్‌ను తన క్యాంపు కార్యాలయంలో కలిసి సమస్యలు విన్నవించారు.

సీసీ రోడ్ల పనులు ప్రారంభం

కడెం: మండలంలోని కొత్తమద్దిపడగ సమీపంలో రాంపూర్, మైసంపేట్ గ్రామస్తులకు ఏర్పాటు చేస్తున్న పునరావాస కాలనీలో గురువారం సర్పంచ్ జడ రాజమణి సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఉపాధిహామీ పథకం కింద రూ.1.70 కోట్లతో సీసీ రోడ్ల పనులు చేపట్టినట్లు వారు పేర్కొన్నారు. ఇందూర్‌నేత, రాంపూర్, మైసంపేట్ వాసులు ఉన్నారు.

రోగులకు పండ్లు పంపిణీ

కడెం: మండల కేంద్రంలో గురువారం మాజీ ఎమ్మెల్సీ, ఏఐసీసీ సభ్యులు కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు జన్మదిన వేడుకలను యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పొద్దుటూరి సతీశ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బరుపటి రమేశ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు తరి శంకర్, భూమన్న, బబ్లూ, వెంకటేశ్, రాజన్న, బ్రహ్మచారి తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా నిమజ్జనం జరుపుకోవాలి

కుంటాల: ప్రశాంతంగా గణేశుడి నిమజ్జనం జరుపుకోవాలని ఎస్సై హన్మాండ్లు సూచించారు. గురువారం రాత్రి మండలంలోని కల్లూర్‌లో నిర్వహించిన శాంతికమిటీ సమావేశంలో మాట్లాడారు. శోభాయాత్రలో డీజేలకు అనుమతి లేదన్నారు. విద్యుత్, చెరువుల వద్ద ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సర్పంచ్ పద్మాబాయి లక్ష్మణ్‌పటేల్, వైస్ ఎంపీపీ మానిక నవీన్, ఏఎస్సై దేవరావు, శాంతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.